

## ఆ కుక్కకి గ్లౌవ్స్ అంటే ప్రియం...

పెంపుడు కుక్కపిల్లలు పాలు, అన్నం, మాంసం ఎక్కువగా తింటాయి. కొన్ని కుక్కలు వీటితో పాటు పచ్చి కూరగాయలు కూడా తింటాయి. ఇది మామూలే! కానీ ఆ కుక్క మాత్రం గ్లౌవ్స్‌ని, సాక్స్‌లనే ఆహారంగా చేసుకుని కడుపులో భద్రంగా దాచుకుంది. దానికి ఆపరేషన్ చేసినప్పుడు దాని కడుపులోంచి బయటపడ్డ ఈ గుడ్డలను చూసి డాక్టర్లు సైతం 'ఔరా' అంటూ ముక్కుమీద వేలు వేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు...

నికోలా పెర్రిట్ అనే వ్యక్తి బెల్లి అనే కుక్కను గత కొన్ని సంవత్సరాలుగా పెంచుకుంటున్నాడు. కుక్కను క్రమం తప్పకుండా వైద్య పరీక్షలకు తీసుకెళ్లడం నికోలా అలవాటు. ఆ అలవాటు చొప్పున ఓరోజు బెల్లిని డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లాడు నికోలా. రొటీన్‌గా చెకప్ చేస్తున్న డాక్టర్‌కు బెల్లి కడుపులో ట్యూమర్ ఉందేమో అని అనుమానం వచ్చింది. వెంటనే ఆ విషయం బెల్లి ఓనర్‌కు చెప్పి ఆపరేషన్ చేయాలని అన్నాడు. నికోలా అందుకు అంగీకరించాడు. బెల్లికి ఆపరేషన్ చేసిన తరువాత కానీ తెలియలేదు. అది తన కడుపులో దాచుకుంది ట్యూమర్ కాదు, కొన్ని గుడ్డలను అని. కుక్క కడుపులోంచి బయటపడిన గుడ్డలను చూసి ఆపరేషన్ చేసిన డాక్టర్‌తో సహా అక్కడున్న అందరూ ఆశ్చర్యపోయారు. బెల్లి కడుపులోంచి రెండు గోల్ఫ్ గ్లౌవ్స్, రెండు రగ్బీ గ్లౌవ్స్, కుస్తీ పోటీలలో చేతులకు తొడుక్కునే గ్లౌవ్స్ ఒకటి, మోకాలి సాక్స్ ఒకటి, తొమ్మిది షూస్ సాక్స్‌లు ఇలా మొత్తం 17 రకాలు బయటపడ్డాయి. వాటిల్లో చిన్న టవల్ కూడా ఉంది.

నికోలా కొడుకు జాక్ మాట్లాడుతూ, 'రెండు సంవత్సరాల క్రితం తన రగ్బీ గ్లౌవ్స్‌లు కనపడకుండా పోయాయని, వాటిని ఎక్కడో పారేసుకున్నానని అనుకున్నాను కానీ వాటిని బెల్లి తన కడుపులో దాచుకుందని ఏమాత్రం ఊహించలేకపోయానని' చెప్పాడు. కుక్క కడుపులోంచి బయటపడ్డ వస్తువులన్నీ ఇంట్లోంచి అప్పుడప్పుడు మాయమైనవే! అవి మాయమైన సంగతి ఇంట్లో వారు గుర్తించినా, వాటిని బెల్లి తిని ఉండవచ్చు అన్న అనుమానం తమకెవరికీ రాలేదని నికోలా చెప్పాడు.

ఈ సందర్భంగా బెల్లికి ఆపరేషన్‌న చేసిన డాక్టర్ మాట్లాడుతూ, బెల్లి ఇన్ని సంవత్సరాల నుంచీ వీటిని తింటున్నా ఏమాత్రం అనారోగ్యం లేకుండా ఆరోగ్యంగా ఉండడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఇలాంటి కేసు తన సర్వీసులో ఇంత వరకూ చూడలేదని చెప్పారు. ఆపరేషన్ తరువాత బెల్లి ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయన వివరించారు.

## 'సరసి' కత

వైశంపాయనుడు అప్పర్ బెర్తు మీద పడుకుని మధ్య రాత్రి వేళ కాళ్ల కేదో తగిలితే ఏమిటా అని చూశాడు. ఓ సన్యాసి!

''ఏయ్ ఇక్కడ కూర్చున్నావేంటి, దిగు'' కసిరేడు వైశంపాయనుడు.

''తాడేపల్లి గూడెం వెళ్లేవాడు తొందరపడితే మాత్రం తాపసులం మేము తొందర పడతామా నాయనా'' అన్నాడు సన్యాసి చిరునవ్వుతో. వైశంపాయనుడు లేచి కూర్చున్నాడు.

''యాభై యేళ్లు దాటేక సంయమనంతో సమస్యలు పరిష్కరించుకోవాలి నాయనా'' అన్నాడు సన్యాసి మళ్లీ.

'వీడి దుంపతెగా నా విషయాలు వీడికెలా తెలిశాయి?' అనుకున్నాడు వైశంపాయనుడు.




''నువ్విపుడు సమస్యల్లో వున్నావు. ప్రతిరోజూ ఏ ప్యాంటూ షర్టూ వేసుకోవాలా అనేదే త్వరగా తేల్చుకోలేని వాడివి ఆ సమస్యల నెట్లా పరిష్కరిస్తావు!!'' అని కళ్లు మూసుకుని చెబుతున్న ఆయన దివ్య దృష్టికి ఆశ్చర్యపోయాడు వైశంపాయనుడు. రెండు చేతులూ జోడించి, సన్యాసి అనుకున్నందుకు చెంపలేసుకుని, రుషిగా ప్రమోషనిచ్చి, కాళ్లకు దణ్ణం పెట్టాడు. అంతే కాకుండా, ఆయన్ని పడుకోబెట్టి, తను ఆయన కాళ్ల దగ్గర కూర్చుని, పాద సేవ చేశాడు తనకు అంతకు మించిన సద్గురువు దొరకడని.

అర్ధరాత్రి వేళ బెజవాడలో రుషిగారు దిగిపోతూ వుంటే వారి ఆశ్రమం పేరు, అడ్రసూ కనుక్కుని, తాను వచ్చి శరణు వేడతానని చెప్పి, ఆయన చేతిలో అడ్వాన్సుగా ఐదువందల నోటు పెట్టాడు.

''బుట్టలో పడ్డారు'' అంది ఇంటికి రాగానే భార్య సుబ్బాయమ్మ. ''సమస్యలు ప్రతి వాడికీ ఉంటాయి, అదే చెప్పి, ఆయన మిమ్మల్ని ఫూల్‌ని చేశాడు'' అంది.

''నువ్వన్నీ ఇట్లాగే తీసి పారేస్తావు, దివ్యదృష్టితో చూడకపోతే నా పేరూ వివరాలూ ఎట్లా తెలుస్తాయి ఆయనకి?'' అన్నాడు వైశంపాయనుడు.

''అవి తెలుసుకోడానికి దివ్య దృష్టి కావాలా? కంపార్టుమెంటుకి అంటించిన చార్టులో లేవా?'' అంది సుబ్బాయమ్మగారు తాపీగా.

*